# వృత్తిధర్మం

-ఓ.చెంచుమోహన్ నాయుడు



రాజకీయాలతోగానీ, రాజకీయ నాయకులతోగానీ అస్సలు పరిచయమే లేని నాకు ఈమధ్య మేం ప్రారంభించబోయే మరో కొత్త ఫ్యాక్టరీ లైసెన్స్‌ల విషయమై అధికార పార్టీ నాయకులతో పనిబడింది. అధికార పార్టీ నాయకుల ప్రాపకం కోసం తంటాలు పడుతున్నాను. అనుకోకుండా నాతో పనిబడి మా ఊరి నుండి మా బంధువొకాయన వచ్చాడు.ఆయన కూడా ఓ రాజకీయ నాయకుడే. మా మాటల మధ్యలో మా కొత్త ఫ్యాక్టరీ గురించి చెబుతూ అందుకు అవసరమయ్యే లైసెన్స్‌ల విషయమై గవర్నమెంట్‌లో పని ఉందనీ, మీకెవరైనా ఎంఎల్ఏనో, మినిస్టరో తెలిసినవాళ్లుంటే నాకు కొంచెం పరిచయం చేయమని అడిగాను.

"ఓస్ అంతేనా... దానిదేముంది అల్లుడూ! ఇప్పుడు అధికారంలో ఉంది మా పార్టీయే" అంటూ లేచి సెక్రటేరియట్‌కి తీసుకెళ్లాడు. ఓ ఐదారుగురు మంత్రుల ఛాంబర్లకు తీసుకెళ్లాడు.

"ఈయన మా అన్నగారి అల్లుడు. ఈయన కొత్తగా ఏదో ఫ్యాక్టరీ పెడుతున్నాడట. దానికవసరమయ్యే పనులు ఏమైనా వుంటే కొంచెం చేసి పెట్టండి" అంటూ నన్ను వాళ్లకు పరిచయం చేసాడు.

"సరేలే మాలకొండయ్యా! మనం మనం ఒక పార్టీవాళ్లం, ఒక జిల్లా వాళ్లం. మనం ఒకరికొకరు సాయం చేసుకోకపోతే ఎట్లబ్బా! పైగా నువ్వు చెప్పాక ఇక తప్పుతుందా? అలాగే చేద్దాం" అంటూ ఒకరిద్దరు మంత్రులు సానుకూలంగానే స్పందించారు.

బయటకొచ్చాక మా బంధువు "ఇదిగో అల్లుడూ! వాళ్లు పనులు చేసేస్తామని చెప్పారని నువ్వు ఊరకుండేవ్. వాళ్లు అట్లాగే అంటారు. కానీ తొందరగా చెయ్యరు" అన్నాడు.

"మరెలాగండీ?" అన్నాను కంగారుగా.

"అంత కంగారు పడాల్సిన సీనేం లేదల్లుడూ. కాకపోతే కొన్ని సూత్రాలు పాటించాలి. తు.చ తప్పకుండా వాటిని పాటిస్తూ నీ పనులు పూర్తి చేసుకో" అంటూ కొన్ని అవసరమైన చిట్కాలు విడమర్చి చెప్పాడు.

***

నా పనులకు అవసరమయ్యే సదరు శాఖ మంత్రిగారితో పరిచయం పెంచుకుని మా బంధువు బోధించిన సూత్రాలు పాటిస్తూ నా పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకోసాగాను.

మన ట్రీట్‌మెంట్‌తో బిత్తరపోయిన సదరు మంత్రిగారు తనకు తీరిక దొరికినప్పుడల్లా "ఏమండీ నాయుడుగారూ! మీరు ఖాళీయేనా? ఖాళీగా ఉంటే రాత్రికి సిట్టింగ్ వేసుకుందామా?" అని తనే నాకు ఫోన్ చేసేవాడు.

***

అలాగే ఆ రోజు మధ్యాహ్నం కూడా ఫోన్ చేసాడు తనతోపాటు మరో మిత్రుడు కూడా వస్తున్నాడనీ, పార్టీ ఘనంగా ఉండాలనీ చెప్పాడు.

రాత్రి ఎనిమిదిగంటలకల్లా సిటీకి దూరంగా ఉన్న మా కంపెనీ గెస్ట్‌హౌస్‌లో మా స్టాఫ్ చేత ఏర్పాట్లన్నీ పూర్తి చేయించి అతిథుల కోసం ఎదురు చూస్తూ ఉండిపోయాను. ఇంతలో సర్రున దూసుకొచ్చిన కారులోంచి మా మంత్రిగారితోపాటు మరో శాల్తీ కూడా దిగాడు. ఈ శాల్తీని ఎక్కడో చూసినట్లుందే... ఎక్కడబ్బా? పేపర్లోనా లేక టీవీలోనో? ఎక్కడో మొత్తానికి చూసాను. ఈమధ్యనే చూసాను. చాలాసార్లు చూసినట్లే ఉంది. సరిగ్గా గుర్తుకు రావడం లేదు. ఆలోచిస్తున్నాను. ఆ...వచ్చింది... గుర్తుకొచ్చింది. ఈయన అంకయ్యనాయుడు. ప్రతిపక్ష పార్టీలో ముఖ్య నాయకుడు. ఈమధ్య అధికార పక్షాన్నీ, మంత్రులనూ, ముఖ్యమంత్రినీ అదేపనిగా చీటికీమాటికీ విమర్శిస్తూ పేపర్లలో, టీవీలో దర్శనమిస్తున్నాడు. అదీ విషయం. కానీ నాకు అర్థం కాని విషయం ఏమిటంటే మా మంత్రిగారితోపాటు కారు దిగడమే.

"ఏంటయ్యా నాయుడూ! అలా బెల్లం కొట్టిన రాయిలా నిలబడిపోయావు? ఈయన అంకయ్యనాయుడు. నా స్నేహితుడు" అంటూ సదరు శాల్తీని నాకు పరిచయం చేసాడు. అలాగే నన్ను కూడా ఆయనకు పరిచయం చేసాడు.

పరిచయ కార్యక్రమం పూర్తి కాగానే "రండి లోపలకు వెళ్లి మాట్లాడుకుందాం" అంటూ లోపలకు తీసుకెళ్లాడు.

పెగ్గుమీద పెగ్గు లాగిస్తున్నాం. నేనొక్కడ్ని వాళ్లకెదురుగా ఉన్నాననే మాటే మరచినట్లు వాళ్లిద్దరూ జోకులు వేసుకుంటూ పగలబడి నవ్వుకుంటున్నారు. ఒకరి కుటుంబ విషయాలు మరొకరు అడిగి తెలుసుకుంటున్నారు, సలహాలు ఇచ్చి పుచ్చుకుంటున్నారు.ఇదంతా చూస్తున్న నాకు ఏమీ అర్థం కావడంలేదు. నా బుర్ర బద్దలవుతోంది.

"ఏంటి నాయుడుగారూ! అదోలా ఉన్నారు?" అన్నారు మంత్రిగారు.

"ఏం చెప్పమంటారండీ. ఎంత తాగినా ఎక్కి చావడంలేదు. పాము, ముంగీస ఒకే పుట్టలోంచి బయటకొచ్చినట్లు అధికార, ప్రతిపక్షాలయిన మీరు ఒకే కారులోంచి దిగారు. రోజూ పేపర్లోనో, టీవీలోనో ఈ అంకయ్యనాయుడు మిమ్మల్ని, మీ ప్రభుత్వాన్ని ముఖ్యంగా మీ ముఖ్యమంత్రిని బండ బూతులు తిడుతుంటాడు. అలాంటి మీరిద్దరూ కలసి ఒకే కార్లో దిగడమేమిటి? ఇలా కలసి మందు కొట్టడమేమిటి? ఒకరి కుటుంబ విషయాలు మరొకరు అడిగి తెలుసుకోవడమేమిటి? దయచేసి నా కన్ఫ్యూజన్‌కు తెర దించండి" అన్నాను.

"ఓస్...దీనికేనా ఇలా బుర్ర కొట్టుకోవడం? అయినా దీనిలో అర్థం కానిదేముంది నాయుడుగారూ? మేం స్నేహితులం. రాజకీయాలను వృత్తిగా చేసుకుని బ్రతుకుతున్నవాళ్లం. కాకపోతే చెరో పార్టీలో ఉంటున్నాం. వాడి పార్టీ అధికారంలో ఉంటే నాకు సాయపడతాడు. మా పార్టీ అధికారంలో వుంటే నేను సాయపడతాను. మేం చెరో పార్టీలో ఉంటున్నాం కాబట్టి ఒకరినొకరం తిట్టుకుంటున్నాం. అసెంబ్లీలో కొట్టుకుంటున్నాం. అంతేగానీ మేమేమన్నా విరోధులమా? అలా తిట్టుకోవడం, కొట్టుకోవడం మా వృత్తిధర్మమయ్యా" అంటూ పగలబడి నవ్వసాగాడు.

మా మంత్రిగారు చెప్పిన సమాధానం విని ఆశ్చర్యంతో నేను తెరిచిన నోరు అలాగే ఉండిపోయింది.

★